ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్లె పాలన.. పట్టుతప్పుతోంది

- కుంటుపడుతున్న గ్రామ ప్రగతి
- ప్రకృతి వనాలపై పట్టింపు కరువు
- నిరుపయోగంగా నీటి ట్యాంకర్లు
- పంచాయతీలను పట్టించుకోని ప్రత్యేకాధికారులు
- క్షేత్రస్థాయిలో కొరవడిన పర్యవేక్షణ



ఖిలాషాపూర్‌లోని పల్లె ప్రకృతి వనం

రఘునాథపల్లి, జూన్ 14: గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం గత జనవరితో ముగియగా ప్రభుత్వం పంచాయతీల పాలనా బాధ్యతలను అధికారులకు అప్పగించింది. ప్రతీ గ్రామానికి గెజిటెడ్ అధికారులను ప్రత్యేక అధికారిగా నియమించింది. అధికారులు కార్యాలయాలకే పరిమితం అవుతుండడం... ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పల్లెల్లో పాలన పట్టుతప్పుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణాల మాదిరిగానే పల్లెల్లోను ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె ప్రకృతి వనాలు ఎండుముఖం పట్టి నిర్వహణ లోపంతో అధ్వానంగా మారుతున్నాయి. జిల్లాలోని 281 గ్రామ పంచాయతీల పరిధిలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. పంచాయతీల్లో అధికారుల కొరత లేకుండా ప్రతి గ్రామానికి కార్యదర్శులను నియమించారు. అయినా పల్లె పాలన గాడిలో పడినట్లు కనిపించడం లేదు. గ్రామ ప్రగతిపై తప్పుడు నివేదికలిస్తూ అధికారులు తప్పించుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిపోయి నాలుగున్నర నెలలు గడచిపోతున్నా... పంచాయతీల పాలనలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రత్యేకాధికారులు తమ శాఖాపరమైన విధులతో పల్లె పాలనపై దృష్టి సారించడం లేదన్న విమర్శలొస్తున్నాయి. తాగునీరు, సైడు కాలువలు, సీసీరోడ్లు, పారిశుధ్య నిర్వహణను ప్రత్యేకాధికారులు పట్టించుకోక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కళతప్పిన పల్లెప్రకృతి వనాలు

చాలా గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలకు నీటి సరఫరా నిలిచిపోవడంతోపాటు నిర్వహణ లేక కళ తప్పాయి. ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసినా పల్లె ప్రజలకు ఆహ్లాదం అందని ద్రాక్షగానే మారిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని గ్రామాల్లో మొక్కలు లేకుండానే పల్లె ప్రకృతి వనాలు దర్శనమిస్తున్నాయి. ఉన్నతాధికారుల ఒత్తిళ్లతో అడపాదడపా మొక్కలు నాటినా సంరక్షణ చర్యలు చేపట్టక పోవడంతో కనిపించకుండానే పోయాయి. కొన్ని చోట్ల మొక్కలు నాటకుండానే తప్పుడు లెక్కలు నమోదు చేసి బిల్లులు కాజేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వనాల చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడంతో పశువులు, మేకలు మొక్కలను ధ్వంసం చేస్తున్నాయి. కొన్నిచోట్ల కొద్దిపాటి మొక్కలను మాత్రమే నాటి పల్లె ప్రకృతి వనాల బోర్డులను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్న దాఖలాలు కూడా ఉన్నాయి. అలాగే నర్సరీల్లో అవసరమైన మొక్కలు అందుబాటులో ఉండడం లేదు.



కోడూరులో సీసీ రోడ్డుపై నిలిచిన మురుగు నీరు



కుర్చపల్లిలో సైడ్‌కాలువలు లేక నిలిచిన వాన నీరు

ఎక్కడి ట్యాంకర్లు అక్కడే..

గత ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీకి ట్రాక్టర్, ట్రాలీ, నీటి ట్యాంకర్‌ను అందించింది. దీంతో తడి, పొడి చెత్త సేకరణ, మొక్కలకు నీటిని సరఫరా చేయాల్సి ఉంది. కానీ, చాలా గ్రామాల్లో నీటి ట్యాంకర్లు నిరుపయోగంగానే కనిపిస్తున్నాయి. ట్యాంకర్ల ద్వారా మొక్కలకు నీళ్లందించక పోవడం వల్ల వాటి పెరుగుదల మధ్యలోనే ఆగిపోయింది. చాలా గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు, నర్సరీ, పారిశుధ్య నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రత్యేకాధికారులు పంచాయతీ పాలనపై పట్టించుకోక పోవడంతో పల్లె ప్రగతి పనులు నిలిచిపోయాయి.



రఘునాథపల్లి, మండలగూడెంలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకర్

కార్యాలయాలకే పరిమితం..

గ్రామాల్లో జరుగుతున్న పల్లె ప్రగతి పనులను నిరంతరం పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. దీంతో పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, సైడు కాలువలు, పైపులైన్లు, సీసీ రోడ్లు, పారిశుధ్యం అధ్వానంగా మారాయి. వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి గెజిటెడ్ అధికారులను గ్రామాల ప్రత్యేక అధికారులుగా నియమించడంతో వారి శాఖలకు చెందిన పనుల్లోనే తలమునకలవుతున్నారే తప్ప గ్రామాల సమస్యలపై దృష్టి సారించడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పాలనను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం జిల్లాకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ను నియమించినా ఆశించిన స్థాయిలో ప్రయోజనం కనిపించడం లేదన్న విమర్శలున్నాయి.

అంకితభావంతో పనిచేయాలి...

- అనిల్‌కుమార్, ఇన్‌చార్జ్ డీపీవో

గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించడం జరిగింది. గ్రామ పంచాయతీ సిబ్బంది ఇంటి పన్నులతో పాటు ఇతరత్రా పన్నులను సకాలంలో వసూలు చేయాలి. అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

రేపటి సంతకం ఈ రోజే!

ఘన్‌పూర్ ఆస్పత్రిలో వైద్యురాలి నిర్వాకం

ఆగ్రహం వ్యక్తం చేసిన అదనపు కలెక్టర్



వైద్యులతో ఫోన్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 14: స్టేషన్‌ఘన్‌పూర్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు నిర్లక్ష్యం వీడడం లేదు. కలెక్టర్ మెమోలు జారీ చేసినా వారి తీరు మారడం లేదు. హాజరు రిజిస్టర్‌లో రేపటి సంతకం కూడా ఈరోజే చేసి వారి పరువు వారే తీసుకుంటున్నారు. నాలుగు రోజుల క్రితమే విధులకు గైర్హాజరైన ఐదుగురు వైద్యులకు కలెక్టర్ నుంచి మెమోలు జారీ అయిన విషయం తెలిసిందే. అయినా వారిలో ఏమాత్రం మార్పు రాలేదు. శుక్రవారం సాయంత్రం అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ సదరు ఆస్పత్రిని తనిఖీ చేయగా డ్యూటీ డాక్టర్ రజని అందుబాటులో లేదు. దీంతో రిజిస్టర్‌ను పరిశీలించి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరాంజనేయులు, డీసీహెచ్‌సీ ఇంచార్జి డాక్టర్ చంద్రమౌళికి ఫోన్ చేసి డ్యూటీ డాక్టర్ దుమ్మాపై ఆరా తీశారు. పైగా రిజిస్టర్‌లో రేపటి (శనివారం) సంతకం కూడా ఈరోజే ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. డాక్టర్ రజనికి ఫోన్ చేసి మందలించారు.

అంతేగాకుండా ఇక నుంచి ప్రతీ రోజు ఎంపీడీవో కాని, ఎంపీవో కాని పీహెచ్‌సీని సందర్శించి వైద్యుల హాజరుపై తనిఖీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి, ఎంపీవో సుధీర్‌కుమార్, ఏపీఎం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సు సీజ్

జనగామ కల్చరల్, జూన్ 14: ఫిట్‌నెస్ లేకుండా తిరుగుతున్న స్కూల్ బస్సును అధికారులు సీజ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో శ్రీ గాయత్రి విద్యాసంస్థలకు చెందిన బస్సును తనిఖీ చేసిన అధికారులు సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో బస్‌డిపోకు తరలించారు. కార్యక్రమంలో డీటీవో శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'కొండా' నివాసానికి మంత్రులు



మంత్రి సురేఖ నివాసంలో ముచ్చటించుకుంటున్న స్పీకర్, మంత్రులు, నేతలు

వరంగల్ సిటీ, జూన్ 14: అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు నివాసంలో శుక్రవారం స్పీకర్ సహా పలువురు మంత్రులు, నేతలు సందడి చేశారు. పలువురు రాష్ట్ర మంత్రులు సందడి చేశారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని ఓ ఫంక్షన్ హాలు లో జరిగిన సీఎం ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి సోదరుడు వేం పురుషోత్తం రెడ్డి సంవత్సరీక కార్యక్రమానికి హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపీ బలరాం నాయక్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజ య్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మంత్రి సురేఖతో సరదాగా మాట్లాడుతూ 'పొరుగు జిల్లా వాళ్లం వచ్చాం.. ఇంటి కి పిలిచి కనీసం చాయ్ ఇవ్వవా అక్కా' అని అనడంతో సురేఖ అందరినీ హను మకొండలోని తన నివాసానికి తీసుకెళ్లారు. వారికి టీ ఇచ్చి, కొద్దిసేపు సరదాగా ముచ్చటించుకున్నారు. అయితే ఇటీవల మంత్రులు సురేఖ, సీతక్క మధ్య వైరం నడుస్తోందన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో వారిద్దరూ అటు ఫంక్షన్ హాలులో, ఇటు కొండా నివాసంలోను పక్క పక్కనే కూర్చుని సరదాగా ముచ్చట్లు చెప్పుకోవడం ఆసక్తిరేపింది.

మంత్రి సురేఖను కలిసిన నీలం మధు

కాంగ్రెస్ నుంచి మెదక్ ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలైన నీలం మధు శుక్రవారం హనుమకొండలోని మంత్రి కొండా సురేఖను మర్యాదపూర్వకంగా కలిశారు. సురేఖకు మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రిగా ఉన్న నేపథ్యంలో మధు హనుమకొండకు వచ్చి మంత్రిని కలిసి జిల్లా అభివృద్ధికి సంబంధించిన విషయాలపై చర్చించారు.

ధరణి దరఖాస్తులను

సత్వరమే పరిష్కరించాలి

సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆదేశాలు

జనగామ కల్చరల్, జూన్ 14: ధరణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆదేశించారు. శుక్రవారం ఆయన హైద్రాబాద్ సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి మరోసారి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, తహసీల్దార్, రెవెన్యూ, డివిజన్ అధికారి, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా, పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్‌తో కలిసి అధికారులకు దిశానిర్దేశం చేశారు. పెండింగ్ దరఖాస్తుల సత్వర పరిష్కారానికి మండలాలకు అవసరమైన అదనపు సిబ్బందిని కేటాయించి, దరఖాస్తులు వేగవంతంగా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీసీలో ఆర్‌డీవోలు కొమురయ్య, వెంకన్న, ఈడీఎం దుర్గారావు, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

మావోయిస్టు దంపతుల లొంగుబాటు

వివరాలు వెల్లడించిన కరీంనగర్ సీపీ అభిషేక్ మోహంతి

రూ.4లక్షల రివార్డు అందజేత

8లో



లొంగిపోయిన మావోయిస్టు దంపతులకు రివార్డు డీడీ అందజేస్తున్న సీపీ అభిషేక్ మోహంతి

ఇక

'విద్యుత్ ప్రజావాణి'

కార్యాలయాల్లో ప్రతీ సోమవారం నిర్వహణ

జనగామ కల్చరల్, జూన్ 14: టీజీఎన్‌పీడీసీఎల్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఇక నుంచి ప్రతీ సోమవారం 'విద్యుత్ ప్రజావాణి' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఈ వేణుమాధవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారం త్వరితగతిన జరగాలన్న ఉద్దేశంతో ప్రజావాణి నిర్వహించాలని సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని ఏఈ, ఈఆర్‌వో, ఏడీఈ, డీఈ కార్యాలయాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, అదేరోజు ఎస్‌ఈ కార్యాలయంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు. వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా, వచ్చే సోమవారం 17వ తేదీ బక్రీద్ పండుగ సందర్భంగా సెలవు ఉన్నందున ఆ తరువాత సోమవారం నుంచి ఈ కార్యక్రమం కొనసాగనుంది.

విద్యుత్ ప్రమాదాల నియంత్రణకు చర్యలు

జనగామ కల్చరల్ : జనగామ సర్కిల్ పరిధిలో విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినట్లు ఎస్‌ఈ టి.వేణుమాధవ్ శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు. ప్రధానంగా భద్రత పట్ల నిర్లక్ష్యం, అవగాహన లోపం, వినియోగదారుల గృహాలలో నాణ్యమైన వైరింగ్ లేకపోవడం, నాసిరకం విద్యుత్ పరికరాలు వాడడం, రైతులు స్విచ్ బోర్డు/మోటార్ స్టార్టర్ల దగ్గర భద్రత ప్రమాణాలు (ఎర్తింగ్) పాటించకపోవడం వల్ల విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఉద్యోగులు భద్రత పట్ల అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎప్పటికప్పుడు సూచనలు జారీ చేస్తూ సిబ్బందికి భద్రత పరికరాలు అందజేయాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు తగ్గించడానికి క్షేత్రస్థా యిలో ప్రతీ ఒక్కరు భద్రత పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.





నిబంధనల ప్రకారం భవన నిర్మాణాలు చేపట్టాలి

బల్దియా కమిషనర్ అశ్విన తానాజీ వాకడే



మడికొండలో భవన నిర్మాణ అనుమతులను పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, జూన్ 14: ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రేటర్ వరంగల్ పరిధిలో భవన నిర్మాణాలు చేపట్టాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విన తానాజీ వాకడే అధికారులకు సూచించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని మడికొండలో పర్యటించి అక్కడి భవన నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చట్టంలో చూపించి విధంగా నిబంధనల మేరకు ప్రమాణాల ప్రకారం భవనాలు నిర్మించే కట్టడాలకు మాత్రమే అనుమతులు మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదాతలను సత్కరిస్తున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

ఒకరి రక్తదానంతో ముగ్గురికి ప్రాణదానం

హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్


సుబేదారి, జూన్ 14 : ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సుబేదారిలోని రెడ్ క్రాస్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ సిక్తాపట్నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఒకరి రక్తదానంతో ముగ్గురికి ప్రాణదానం చేయవచ్చని అన్నారు. రెడ్ క్రాస్ సొసైటీలోని జనరిక్ మందుల షాపు తలసేమియా సెంటర్‌ను సందర్శించి చిన్నారులతో మాట్లాడి వారి బాగోగులు తెలుసుకున్నారు. తలసేమియా బాధితులకు పండ్లు పంపిణీ చేశారు. హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తలసేమియా సెంటర్‌తో పాటు జనరిక్ మెడికల్ షాపు నిర్వహణలో రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో ఉందని తెలిపారు. అత్యవసర సమయంలో రెడ్ క్రాస్ సేవలు ముందుంటాయని ప్రాణాలను కాపాడేందుకు తమ రక్తాన్ని దానం చేసిన రక్తదాతలను రక్తదాన శిబిరాలను నిర్వహించిన ఆర్గనైజర్లను ఈ సందర్భంగా కలెక్టర్ అభినందించారు.

కార్యక్రమం అనంతరం ఉత్తమ రక్తదాతలుగా ఎంపికైన వారికి కలెక్టర్, పాలక వర్గం చేతుల మీదుగా ప్రశంసాపత్రం, షీల్డు, శాలువాతో సత్కరించారు. అనంతరం కలెక్టర్‌ను పాలకవర్గం షీల్డు, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణగౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, పాలక వర్గ సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాసరావు, డాక్టర్ సీహెచ్. సంధ్యారాణి, బాషెట్టి హరిప్రసాద్, రక్తదాతలు, బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఆర్గనైజర్స్, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.














రాంనగర్‌లోని తన నివాసంలో వినతులు స్వీకరిస్తున్న మంత్రి సురేఖ

ఎప్పుడైనా.. ఎక్కడైనా నన్ను కలవొచ్చు

● అటవీ, దేవాదాయ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

● నివాసంలో ప్రజల నుంచి వినతుల స్వీకరణ

వరంగల్‌సిటీ, జూన్ 14: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని, ఎవరైనా.. ఎప్పుడైనా.. ఎక్కడైనా తనను కలవచ్చని అటవీ, దేవాదాయ పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం హనుమకొండ రాంనగర్‌లోని తన నివాసంలో తూర్పు నియోజకవర్గంలో నుంచి వచ్చిన ప్రజలకు అందుబాటులో ఉన్నారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేమన్నారు. మంత్రిగా ఉన్న నేపథ్యంలో హైదరాబాద్ లేదా ఇతర జిల్లాల పర్యటనలో ఉన్నప్పుడు నియోజకవర్గానికి చెందిన నాయకులు ప్రజల సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. వరంగల్, హనుమకొండ, హైదరాబాద్‌లోని తన నివాసంలో లేదంటే సెక్రటేరియెట్‌లో కలవవచ్చని తెలిపారు. శుక్రవారం సుమారు 150 వినతులను పరిష్కరించినట్టు తెలిపారు.

గొర్రెలకాపరితో ప్రభుత్వ పథకాలపై ఆరా...

హనుమకొండ రాంనగర్‌లో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం తోటి మంత్రులు, ప్రజలు, నాయకులతో మంత్రి సురేఖ బిజీబిజీగా గడిపారు. సాయంత్రం మంత్రి హైదరాబాద్ బయలుదేరారు. మార్గ మధ్యలో ఓ గొర్రెలకాపరి గొర్రెల మందతో రోడ్డు పక్కన వెళుతుండగా మంత్రి కాన్వాయ్ దిగి అతడి వద్దకు వెళ్లి రెండు చిన్న గొర్రెపిల్లలు ఎత్తుకున్నారు. గొర్రెలకాపరితో ముచ్చటిస్తూ ప్రభుత్వ పథకాలు మీకు, మీ గ్రామస్థులకు చేరుతున్నాయా.. అంటూ నెమ్మదిగా ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. కొద్దిసేపు మాట్లాడి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పురుషోత్తం రెడ్డి సేవలు మరువలేనివి


వేం పురుషోత్తం రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రులు, కాంగ్రెస్ నాయకులు

బాలసముద్రం, జూన్ 14: ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు వేం నరేందర్ సోదరుడు వేం పురుషోత్తంరెడ్డి ప్రథమ వర్ధంతిని హనుమకొండలోని సీఎస్ఆర్ గార్డెన్‌లో కుటుంబ సభ్యులు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూయ (సీతక్క), పొన్నం ప్రభాకర్‌గౌడ్, తెలంగాణ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొని పురుషోత్తం రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆపద్బాంధవులు

- అత్యవసర సమయాల్లో డీఆర్ఎఫ్ సేవలు భేష్
- దయనీయ స్థితిలో సిబ్బంది పరిస్థితి
- చాలీచాలని జీతాలతో కాలం వెల్లదీత
- బల్దియా కమిషనర్ పట్టించుకోవాలని వేడుకోలు


బల్దియా పరిధిలో సేవలందించే డీఆర్ఎఫ్ సిబ్బంది

వరంగల్ కార్పొరేషన్, జూన్ 5: వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) విపత్తు ప్రతిస్పందన దళం సమస్యల వలయంలో కునారిల్లుతోంది. సిబ్బందికి ప్రభుత్వం నుంచి అందించే కనీస సౌకర్యాలు అందించకపోవడంతో పాటు నెలవారిగా వచ్చే చాలీచాలనీ జీతం సైతం సమయానికి అందకపోవడంతో సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. నగర ప్రజల ప్రాణాలు కాపాడేందుకు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పనిచేసే డీఆర్ఎఫ్ సిబ్బంది సేవలు వెలకట్టలేకుండా ఉన్నా వారిపనికి గుర్తింపు లేదు. సిబ్బందికి పనికి సరిపడా వేతనం లేక ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన ధరలు, మారుతున్న పరిస్థితుల దృష్ట్యా కొంత మేరకు జీతాలు పెరిగితే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం అన్ని అలవెన్స్‌లు కలుపుకుని రూ. 17,500 మాత్రమే వస్తున్నాయని, కనీసం రూ. 25వేల వరకు జీతం పెంచితే పిల్లల చదువులకు ఉపయోగపడుతాయని విజ్ఞప్తి చేస్తున్నారు.

అయితే ఐదేళ్ల కాలంలో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 30 మంది డీఆర్ఎఫ్ సిబ్బంది మాత్రమే పని చేస్తున్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌ల పరిధిలో 12లక్షలకు పైచిలుకు జనాభా నివసిస్తున్నారు. కానీ 24 కిలో మీటర్ల దూరం విస్తరించి ఉన్న బల్దియా పరిధిలో విపత్తు జరిగిన సమయంలో ప్రమాదస్థలికి వెళ్లాలంటే సిబ్బందికి ప్రాణసంకటంగా మారుతోంది. మంటల్లో చిక్కుకున్న వారిని సైతం తీసేందుకు వీరినే వినియోగించడం, గ్యారెంటీ లేని వీరి జీవితాలకు కార్పొరేషన్‌పరంగా కనీస బీమా కల్పించకపోవడం బాధిస్తోందంటున్నారు. నీటి ప్రమాదాల్లో మృతిచెంది ముక్కలుగా విడిపోతున్న శరీర భాగాలను వెలికి తీసే వీరి పని సాహసోపేతమైనది.

సాహస కార్యాలు

- గొర్రెకుంటలో హత్యచేసి పడేసిన 9 మృతదేహాలు వెలికితీత.
- హంటర్‌రోడ్డులో వరదలో మునిగిపోయిన ఇద్దరు వృద్ధులు, నలుగురు మహిళలను నీటి ప్రమాదం నుంచి తప్పించారు.
- సమ్మయ్యనగర్‌లో వరదలో చిక్కిన వారిని పడవల సహాయంతో కాపాడారు.
- భద్రకాళి సంతోషిమాత గుడి వెనుక గుండంలో మృతి చెందిన వృద్ధురాలి వెలికితీత.
- కేసీ కెనాల్ ఆటోనగర్ వద్ద రెండు మృతదేహాల వెలికితీత.
- నక్కలపల్లిలో బావిలో పడి ఆత్మహత్య చేసుకున్న మహిళ మృతదేహం వెలికితీత.
- న్యూశాయంపేట చెరువులో మృతదేహం వెలికితీత.
- రంగంపేటలో బావిలో పడిన వృద్ధురాలి మృతదేహం వెలికితీత.
- ఏనుమాముల మార్కెట్ వెనుక మునలమ్మకుంటలో ఇద్దరి మృతదేహాలు వెలికితీత.
- గాలి వానకు రోడ్డుకు అడ్డంగా పడిపోయిన 452 చెట్లు తొలగింపు.
- 240 అక్రమ కట్టడాలు, నిర్మాణాలు తొలగింపు.

2010లో డీఆర్ఎఫ్ విభాగం ఏర్పాటు

ప్రజలు నివసించే ప్రదేశాల్లో విపత్తు జరిగిన సమయంలో అక్కడి పరిస్థితులను అదుపు తెచ్చి ప్రాణనష్టం జరుగకుండా కాపాడేందుకు రాష్ట్ర వ్యాప్తంగా డీఆర్ఎఫ్ (విపత్తు ప్రతిస్పందన దళం) బృందాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కమిషనర్‌గా పమేలా సత్పతి పని చేసిన కాలంలో వరంగల్ బల్దియాలో 2019 జూన్ మాసంలో డీఆర్ఎఫ్ బృందాలను ఏర్పాటు చేశారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ లేకుండా నగరంతో పాటు విలీన గ్రామాల గ్రామ పంచాయతీ కార్యాలయాలకు అనుసంధానంగా పని చేసే దినసరి ఉద్యోగులలో ఆసక్తి ఉన్నవారిని మౌఖిక పరీక్ష ఆధారంగా డీఆర్ఎఫ్ విభాగంలో నియమించారు. 30మందితోపాటు ఇద్దరు డ్రైవర్లను నియమించారు. సిబ్బందిని పర్యవేక్షించేందుకు ఇన్‌చార్జి ఉంటారు. కాగా, డీఆర్ఎఫ్ సిబ్బంది ఎల్లవేళలా విధులు నిర్వర్తిస్తారు. రోజుకు మూడు షిప్టులతో పని చేస్తూ నక్కలగుట్ట వాటర్ ట్యాంక్, బల్దియా ఇండోర్ స్టేడియం వద్ద స్టాండింగ్ డ్యూటీలో ఉంటారు.

అత్యవసర సమయంలో..

బల్దియా పరిధిలో ఎలాంటి విపత్తు జరిగినా టోల్ ఫ్రీ నెంబర్ 18004351980తో పాటు 9701999676 రిస్క్‌కాల్ కావడంతో బల్దియా డీఆర్ఎఫ్ సిబ్బందికి అప్రమత్తం చేస్తారు. వీరు రాత్రనక, పగలనక ఘటనా స్థలానికి చేరుకుని పనిలో నిమగ్నమై పోతారు. కిందటేడు వర్షాకాలంలో నగరం నీటమునగడంతో పాటు చాలాచోట్ల ఇళ్లలోకి వరద నీరు చేరుకోగా చాలామంది ప్రాణాలు కాపాడడంతో వీరి కృషి వెలకట్టలేనిది. ఇంకా భద్రకాళి చెరువు మత్తడి పడి చెరువు కట్ట తెగిపోవడంతో వీరు దిగువ ప్రాంతంలో ఉన్న వారిని అప్రమత్తం చేయడంతో పాటు విలువైన వస్తువులను గడ్డకు చేర్చారు. అంతేకాకుండా వర్షాలు, ఫ్లడ్స్, పేలుళ్లు, అగ్నిప్రమాదాలు, నీటి ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు, చెరువులు, కెనాల్‌లో పడిన మనుషుల మృతదేహాలు, జంతువుల కళేబరాలు తీయడం, గాలి వానకు రోడ్డుకు అడ్డంగా పడి పోయిన చెట్లను తొలగించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేయడం వంటి పనులు చేస్తారు. అంతేకాకుండా నగరంలో రోడ్లను ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలు, అక్రమ నిర్మాణాలు, అక్రమ ర్యాంప్‌ల నిర్మాణాలు, అక్రమ వెంచర్‌ల నిర్మాణాలను తొలగించేందుకు డీఆర్ఎఫ్ సిబ్బందిని ఉపయోగిస్తున్నారు. అయితే సిబ్బంది కొరత వల్ల ప్రమాదాలు జరిగే ప్రతీ చోటికి వెళ్లడం కష్టంగా ఉందని సిబ్బంది చెప్పుకొస్తున్నారు. 12 లక్షల జనాభాకు కనీసం 150 మంది సిబ్బంది 5 వాహనాలు, 10 మంది డ్రైవర్లు, ఒక పూర్తికాలం సూపరింటెండెంట్ స్థాయి అధికారిని నియమించాలని, దీనిపై కమిషనర్ స్పందించాలని సిబ్బంది వేడుకున్నారు.


మృతదేహాలను వెలికితీస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది (ఫైల్)

బల్దియాలో బదిలీ ప్రకంపనలు

సెక్షన్‌లో ఆరా తీస్తున్న ఉద్యోగులు

వరంగల్ కార్పొరేషన్, జూన్ 14: వరంగల్ బల్దియాలో వివిధ విభాగాల సిబ్బందికి, వింగ్ అధికారులకు బదిలీలు తప్పవనే వార్తలు ఉద్యోగుల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'బల్దియాలో బదిలీల గుబులు' అనే వార్త ప్రచురితం కావడం చర్చనీయాంశమైంది. ట్రాన్స్‌ఫర్ అయ్యే సుమారు 126 మంది ఉద్యోగుల్లో తమ పేరు ఉందా? అని బల్దియా ఉన్నతాధికారులు, సి-1 సెక్షన్ సిబ్బంది వద్దకు వెళ్లి రహస్యంగా తెలుసుకున్నారు. ఇంకా టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్, పబ్లిక్ హెల్త్, మలేరియా, హార్టికల్చర్ సిబ్బంది వారి అనుయాయులను ట్రాన్స్‌ఫర్ విభాగం సెక్షన్ అధికారుల వద్దకు పంపించి విచారించినట్లు సమాచారం. ఇంకా కొందరు ఫోన్‌ల ద్వారా బదిలీ ప్రక్రియపై అడిగి తెలుసుకున్నారు.

ప్రజాప్రతినిధుల వద్దకు పరుగులు

బల్దియాలో బదిలీలు జరుగుతాయని తెలిసిన ఉద్యోగులు ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఇంకా కొందరు మునిసిపల్ అధికారులను ప్రసన్నం చేసుకుని బదిలీ నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఢిల్లీలో ఉన్న కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే నగరానికి వచ్చిన తర్వాత సర్వీస్ బుక్ ఆధారంగా బదిలీలు తప్పకుండా జరుగుతాయని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనానికి విద్యార్థి ఎంపిక




ఐనవోలు, జూన్ 14: ఐనవోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి బండ విజయ్ ఎన్ఎంఎంఎస్(జాతీయ స్థాయి)లో ఉపకారవేతనానికి ఎంపికయ్యారు. ఈ యేడు ఫిబ్రవరిలో నిర్వహించిన ఎంపిక పరీక్షలో పాల్గొని ఎంపికైనట్లు ఆ విభాగం ఇన్‌చార్జి ఉపాధ్యాయుడు పి. సత్యనారాయణరావు తెలిపారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రతీ సంవత్సరం రూ.12 వేల చొప్పున రూ.48 వేల ఉపకార వేతనాన్ని పొందనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి విజయ్‌ను హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

అఖిల భారత నృత్యోత్సవంలో ప్రతిభ

కాజీపేట, జూన్ 14: ఒడిషాలోని పూరి జగన్నాథ దేవాలయంలో జరిగిన అఖిల భారత నృత్యోత్సవంలో వివిధ విభాగాల్లో తాళ్లపల్లి పద్మావతి ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించారు. పాఠశాలకు చెందిన ఆశ్రితారెడ్డి గ్రూప్ డ్యాన్స్ కేటగిరిలో ప్రథమ బహుమతి గెలుచుకోగా, డ్యూయెట్ డాన్స్ కేటగిరిలో నిగేషిత ప్రథమ బహుమతి సాధించారు. వీరిని చైర్మన్ తాళ్ల మల్లేశం అభినందించారు.

కుంగిన ఏడో బ్లాక్‌లో మరో గేటు ఎత్తివేత

● మొత్తం 11గేట్లలో 10గేట్ల ఎత్తివేత పూర్తి ● మేడిగడ్డ బ్యారేజీలో కొనసాగుతున్న 20వ గేటు తొలగింపు పనులు ● ముగిసిన సీఎస్ఎంఆర్ఎస్ బృందం పరీక్షలు


పూర్తిగా పైకెత్తిన 21వ నెంబరు గేటు

మహదేవపూర్ రూరల్, జూన్ 14 : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మహదేవపూర్ మండలంలో కుంగుబాటుకు గురైన మేడిగడ్డ బ్యారేజీ ఏడో బ్లాక్‌లో గేట్ల ఎత్తివేత పనులు చివరి దశకు చేరుకున్నాయి. అందులో భాగంగా శుక్రవారం 21వ నెంబరు గేటును 12.50 మీటర్ల ఎత్తుకు విజయవంతంగా ఎత్తారు. బ్లాక్-7లో మొత్తం 11 గేట్లు ఉండగా శుక్రవారంవరకు 10 గేట్లను ఎత్తివేశారు. కుంగుబాటు ప్రభావం అధికంగా ఉన్న 20వ గేటు ఎత్తడం ఇబ్బందికరంగా మారడంతో గత నెల 25న ఆర్క్‌గ్రాగింగ్ పద్ధతిన గేటు కట్‌చేసి తొలగించే పనులు ప్రారంభించారు. రెండు రోజుల క్రితమే గేటు కటింగ్ పూర్తయినప్పటికి దాని విడిభాగాల తొలగింపు కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పిల్లర్ల కిందున్న అగాధం పూడ్చివేతలో భాగంగా చేపట్టిన ఇసుక, సిమెంటు గ్రౌటింగ్, షీట్‌ఫైల్స్ అమరిక, సీసీబ్లాకుల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి.

గేట్లు ఎత్తారిలా..

తొలుత బ్లాక్-7లోని 11 గేట్లలో 19, 20, 21, 22గేట్లను ఎత్తేందుకు వీలుకాదని.. వీటన్నింటిని తొలగించాలని అధికారులు భావించారు. ఆ తర్వాత 19, 22 గేట్లను ఆటోమాటిక్ పద్ధతిన ఎత్తిన అధికారులు 20, 21 గేట్లను తొలగించాలని నిర్ణయించారు. తాజాగా చేపట్టిన ఇసుక, సిమెంట్ గ్రౌటింగ్ పనులతో పిల్లర్ల కింద గట్టిదనం ఏర్పడటంతో శుక్రవారం కుంగిన పిల్లరు పక్కనే ఉన్న 21వ గేటును సైతం విజయవంతంగా పైకెత్తారు. నెల రోజుల వ్యవధిలో గేట్లు ఎత్తే ప్రక్రియను ఓ కొలిక్కి తీసుకువచ్చారు. గత మే నెల 17న 15వ నెంబరు గేటును ఎత్తగా, జూన్ 6న 16, 17 గేట్లను ఎత్తారు. 8న 22వ గేటును ఎత్తిన అధికారులు తాజాగా గురువారం సాయంత్రం 18, 19 గేట్లను, శుక్రవారం 21వ గేటును ఎత్తారు. దీంతో బ్లాక్-7లో మొత్తం 11 గేట్లకు గాను 10 గేట్లను ఎత్తివేశారు.

ముగిసిన సీఎస్ఎంఆర్ఎస్ బృందం పరీక్షలు

నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఏడో బ్లాక్‌లో న్యూఢిల్లీకి చెందిన సీఎస్ఎంఆర్ఎస్(సెంట్రల్ సాయిల్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్) నిపుణుల బృందం ఆధ్వర్యంలో చేపట్టిన టెస్టులు, పలు నమూనాల సేకరణ పనులు శుక్రవారంతో ముగిశాయి. జూన్ 5వ తేదీన మేడిగడ్డ బ్యారేజీలోని బ్లాక్-7లో సీఎస్ఎంఆర్ఎస్‌కు చెందిన హరిదేవ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల నిపుణుల బృందం భూభౌతిక, మృత్తిక, భూసాంకేతిక పరీక్షలను ప్రారంభించింది. పది రోజుల పాటు బ్లాక్-7లో చేపట్టవలసిన పరీక్షలు, నమూనాలను సేకరించిన బృందం పరీక్షల్లో ప్రధానమైన జియోఫిజికల్, జియో టెక్నికల్, కాంక్రీట్‌పరీక్షలను పూర్తిచేసి శుక్రవారం న్యూఢిల్లీకి వెళ్లిపోయారు. బ్యారేజీ కింద 25 మీటర్ల లోతున ఉన్న మట్టి నమూనాలతో పాటు మరికొన్ని శాంపిల్స్ సేకరణను నిర్మాణ సంస్థతో పాటు ఇంజనీరింగ్ అధికారులు సేకరించి న్యూఢిల్లీలోని సీఎస్ఎంఆర్ఎస్ ల్యాబ్‌కు పంపించాలని చెప్పి వెళ్లినట్లు తెలిసింది. సీఎస్ఎంఆర్ఎస్ బృందం చేపట్టిన పరీక్షలు ఇంతటితో పూర్తి కావని, మరో ఐదారు విడతలు బ్యారేజీని పరిశీలించి పరీక్షించనున్నట్లు తెలిసింది.

మూలమలుపులో కలప లారీ బోల్తా

గూడూరులో దుంగలు మీదపడి ఇద్దరి దుర్మరణం ● మృతుల్లో సీఐ గన్‌మెన్, సీఆర్టీ ఉపాధ్యాయుడు


గూడూరులో రాస్తారోకో నిర్వహిస్తున్న మృతుల బంధువులు, ఆదివాసీ సంఘాల నాయకులు


గూడూరు వద్ద లారీబోల్తా పడిన ఘటనలో మృతి చెందిన ధనసరి పాపారావు, చుంచా దేవేందర్

గూడూరు, జూన్ 14: కలపదుంగల లోడుతో వెళుతున్న ఓ లారీ మూలమలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు దుర్మరణం పాలైన సంఘటన గూడూరులో శుక్రవారం ఉదయం జరిగింది. మృత్యుశకటంలా వచ్చిన ఆ లారీ రహదారి పక్కన టీ తాగుతున్న ఇద్దరి ప్రాణాలు తీయడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనకు సంబంధించి గూడూరు ఎస్ఐ నాగేష్ తెలిపిన వివరాల ప్రకారం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి జామాయిల్ కలప దుంగల లోడుతో ఓ లారీ మహబూబాబాద్ మీదుగా బలార్షాకు వెళుతోంది. శుక్రవారం ఉదయం గూడూరు మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో మూలమలుపు వద్ద వేగంగా వచ్చిన ఆ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో లారీలోని దుంగలు మీదపడి గూడూరు మండలం మట్వాడ శివారు కొంగరిగిద్దకు చెందిన ధనసరి పాపారావు (35), మచ్చర్లకు చెందిన చుంచా దేవేందర్ (34) అక్కడికక్కడే మృతి చెందారు. వీరిలో ధనసరి పాపారావు గూడూరు సీఐ గన్‌మెన్‌గా, చుంచా దేవేందర్ ములుగు జిల్లా రాయినిగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాల సీఆర్టీ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్నారు. మానుకోట పట్టణంలో జరిగే పోలీస్ శిక్షణ కార్యక్రమానికి తన ద్విచక్రవాహనంపై ఉదయం కొంగరిగిద్దలోని ఇంటి నుంచి ధనసరి పాపారావు ఠాణాలో ఉన్న బూట్లు, యూనిఫాం కోసమని బయలు దేరి వస్తున్నాడు. స్కూల్‌కు వెళ్లేందుకు మచ్చర్ల వద్ద బస్సుకోసం వేచిచూస్తున్న దేవేందర్‌ను బైక్‌పై ఎక్కించుకుని గూడూరుకు చేరుకున్నారు. వరుసకు అన్నదమ్ములైన వారు బైక్‌ను పక్కన పెట్టి, గూడూరులోని మూలమలుపు బస్టాప్ పక్కనే ఉన్న టీస్టాల్ వద్ద టీ తాగుతున్నారు. 365 జాతీయ రహదారిపై జమాయిల్ కలప దుంగల లోడుతో వచ్చిన లారీ అదుపు తప్పి గూడూరులోని బస్టాండ్ మూలమలుపు వద్ద బోల్తా పడింది. అక్కడే ఉన్న పాపారావు, దేవేందర్‌పై దుంగలు పడడంతో అక్కడికక్కడే వారు మృతి చెందారు.

ఎస్ఐ నగేష్ ఘటన స్థలానికి చేరుకుని, ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌కు సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న ఎస్పీ దుంగలను తొలగించే సహాయక చర్యలు పర్యవేక్షించారు. స్థానికుల సాయంతో దుంగలను తొలగించి పాపారావు, దేవేందర్‌ను బయటకు తీయగా, అప్పటికే వారు మృతిచెంది ఉండటంతో పోస్టుమార్టం నిమిత్తం గూడూరు మార్చురీకి తరలించారు. పోస్టుమార్టం అనంతరం ఇద్దరి మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. సీఐ గన్‌మెన్ ధనసరి పాపారావు కుటుంబసభ్యులను ఎస్పీ పరామర్శించి, ధైర్యం చెప్పారు. తక్షణ సాయంగా రూ.20 వేలు అందించారు. అనంతరం కొంగరిగిద్దలో ప్రభుత్వ అధికార లాంఛనాలతో పాపారావు అంత్యక్రియలను పూర్తి చేశారు. అలాగే మచ్చర్లలో చుంచ దేవేందర్ అంత్యక్రియలు జరిగాయి. అంత్యక్రియల సమయంలో దేవేందర్ మృతిని తట్టుకోలేక రోదిస్తున్న భార్య భారతి అస్వస్థతకు గురయ్యారు. ఆమెను గూడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సనందించారు. ఎస్పీ ఆస్పత్రికి చేరుకుని, భారతిని ధైర్యంగా ఉండాలని చెప్పారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, డీఎస్పీ తిరుపతిరావు పాపారావు, దేవేందర్ మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. కాగా, రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పాపారావు, దేవేందర్ కుటుంబాలకు న్యాయం చేయాలని కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు, ఆదివాసీ సంఘాల నాయకులు గూడూరులో ధర్నా నిర్వహించారు. ఎస్సై నగేష్ మృతుల కుటుంబాలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళనను విరమించారు.


మృతదేహాలను పరిశీలిస్తున్న మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

ఒకే పాఠశాలలో ఇద్దరి విద్యాభ్యాసం

పాపారావు, దేవేందర్ తమ విద్యాభ్యాసాన్ని గూడూరు మండలం దామెరవంచ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో పూర్తి చేశారు. పాపారావు 2003-04 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేయగా, దేవేందర్ 2004-05లో ఎస్సెస్సీ పూర్తి చేశాడు. ఒకేచోట చదువుకున్న ఇరువురు బంధుత్వంతో పాటు మంచి మిత్రులుగా ఉండేవారు. మృత్యువులో కూడా వారి స్నేహబంధం వీడకపోవడం అందరి మనస్సులను కలచివేసింది.

ప్రమాదం నుంచి బయటపడ్డ మరో ముగ్గురు..

గూడూరులో ప్రమాదం జరిగిన సమయంలో టీకొట్టు యాజమాని మౌలానా టీ పొడి తీసుకొచ్చేందుకు కిరాణా షాపునకు వెళ్లగా, మానుకోట పట్టణం గుమ్ము దూరుకు చెందిన మరోవ్యక్తి పొగాకుల పోతరాజు వ్యాపారం చేసుకుంటూ బస్టాండ్ వద్దకు ఉన్న టీస్టాల్ ముందు ఆటో నిలిపాడు. ఆయనకు ఫోన్ రావడంతో పక్కవెళ్లి మాట్లాడుతున్నాడు. ఇంతలోనే కలప దుంగలతో వచ్చిన లారీ ఒక్కసారిగా బోల్తా పడడంతో వారు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. పక్కనే ఉన్న కూరగాయల దుకాణం తీసేందుకు వచ్చి వ్యాపారి సురేష్‌కు కలప దుంగలు తగలడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు.


రౌతుగూడెంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న కొత్తగూడ ఎస్సై దిలీప్

భర్త మరణం తట్టుకోలేక భార్య ఆత్మహత్య

మహబూబాబాద్ జిల్లా రౌతుగూడెంలో ఘటన

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), జూన్ 14 : విధి ఆ కుటుంబాన్ని పగపట్టింది. వరుస విషాదాలు ఆ కుటుంబాన్ని వెంటాడుతున్నాయి. రోడ్డు ప్రమాదంలో భర్త మరణించడాన్ని జీర్ణించుకోలేకపోయినా ఆ ఇల్లాలు బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పది రోజుల వ్యవధిలో జరిగిన ఈ ఘటనలతో ఆ కుటుంబం దుఃఖసాగరంలో మునిగింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని రౌతుగూడెంలో జరిగింది. ఎస్ఐ దిలీప్ తెలిపిన వివరాల ప్రకారం.

కొత్తగూడ మండలంలోని రౌతుగూడెం గ్రామానికి చెందిన మాలోతు రవికి వరంగల్ జిల్లా సంగెం మండలం తిమ్మాపురానికి చెందిన సరిత (38)తో 18 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి సంతానం లేదు. వ్యవసాయంతో పాటు కూలిపనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 5వ తేదీన వరంగల్ జిల్లా సంగెం మండలంలో తమ బంధువు మరణించగా పరామర్శించేదుకు వెళ్లి, తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మాలోతు రవి మృతి చెందాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన సరిత గురువారం రాత్రి గ్రామ సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఉదయం ఇంట్లో సరిత కనిపించక పోవడంతో కుటుంబసభ్యులు, గ్రామస్థులు చుట్టుపక్కల వెతకగా.. గ్రామశివారు బావిలో సరిత మృతదేహాన్ని కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, పంచనామా నిర్వహించారు. మృతురాలి సోదరుడు అంగోత్ గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్ఐ దిలీప్ తెలిపారు. ఇక సరిత చెల్లెలు కూడా పది రోజుల క్రితం మరణించింది. ఇలా వరుస విషాదాలు ఆ కుటుంబాన్ని వెంటాడుతున్నాయని స్థానికులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.


మాలోతు రవి, సరిత (ఫైల్)

వర్షాల కోసం గ్రామదేవతలకు పూజలు



తిమ్మంపేటలో బొడ్రాయి దేవతకు జలాభిషేకం చేస్తున్న మహిళలు

జఫర్‌గఢ్, జూన్ 14: వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు పండాలని కోరుతూ గ్రామాల్లో వనదేవతలు, గ్రామ దేవతలను కొలుస్తూ పూజలు చేస్తున్నారు. శుక్రవారం తమ్మడపల్లి(ఐ), తిమ్మంపేట, తదితర గ్రామాల్లో గ్రామ దేవతలకు మహిళలు పూజలు నిర్వహించారు. గ్రామాల్లో బొడ్రాయి, పోచమ్మ, హనుమాన్, దుర్గమ్మ, అంకాలమ్మ ఆలయాల వద్ద మహిళలు బిందెలతో నీటిని తీసుకువచ్చి అమ్మవార్లకు జలాభిషేకం చేశారు. ఖరీఫ్ సీజన్ ఆరంభమై నెల రోజులు కావస్తున్నా వర్షాల జాడ లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తొలకరి వర్షానికి వేసిన విత్తనాలు మొలకెత్తక పోవడంతో వర్షాలు కురవాలని వరుణుడి కరుణ కోసం ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. వర్షాలు సమృద్ధిగా వర్షాలు కురిపించాలని, చెరువులు కుంటలు నిండి తద్వారా పంటలు సమృద్ధిగా పండాలని గ్రామ దేవతలను వేడుకుంటూ మహిళలు పూజలు చేశారు.

నేడు దేవరుప్పుల మండల సర్వసభ్య సమావేశం

దేవరుప్పుల, జూన్ 14: దేవరుప్పుల మండల సర్వసభ్య సమావేశం శనివారం మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మీనారాయణ వెల్లడించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఉదయం 11గంటలకు సభ ప్రారంభమవుతుందని వివిధ శాఖల అధికారులు మండల ఎంపీటీసీలు, ప్రత్యేకాధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మావోయిస్టు దంపతుల లొంగుబాటు

కరీంనగర్ క్రైం, జూన్ 14: సీపీఐ(ఎంఎల్) మావోయిస్టు పార్టీకి చెందిన ఏరియా కమిటీ సభ్యులు తిక్క సుష్మిత అలియాస్ చైతె, మడకం దూల అలియాస్ దూల శుక్రవారం పోలీసులకు లొంగిపోయారు. వీరిద్దరు భార్యాభర్తలు. ఈ మేరకు వరంగల్ ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్, కరీంనగర్ సీపీ అభిషేక్ మోహంతి కరీంనగర్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. సెంట్రల్ కమిటీ మెంబర్, తెలంగాణ రాష్ట్ర కమిటీ ఇన్‌చార్జి వద్ద సుష్మిత సెంట్రల్ కమిటీ స్టాఫ్‌గా, దూల ప్రొటెక్షన్ టీం మెంబర్‌గా పని చేశాడని సీపీ తెలిపారు.

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సుదన్‌పల్లి గ్రామానికి చెందిన తిక్క సుష్మిత(27) ఇంటర్మీడియేట్ వరకు చదువుకుంది. ఆమె తండ్రి తిక్క సుధాకర్ మావోయిస్టు సానుభూతి పరుడిగా పనిచేశాడు. తండ్రిని చూసి మావోయిస్టు పార్టీకి ఆకర్షితురాలైన సుష్మిత.. తన చదువు అనంతరం 2016లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా కోమటిపల్లి గ్రామం అటవీ ప్రాంతంలో బడె చొక్కారావు అలియాస్ దామోదర్ సమక్షంలో మావోయిస్టు పార్టీలో చేరారు. అలాగే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా పర్య గ్రామానికి చెందిన మడకం దూల ఐదో తరగతి వరకు చదువుకున్నాడు. ఆయన సోదరుడు ఐయేత 2008లో సీపీఐ మావోయిస్టు పార్టీలో చేరాడు. అతడిని చూసి ఆకర్షితుడైన దూల.. 2015లో ఏరియా కమిటీ మెంబర్ అయిన జోగి ప్రోత్సాహంతో మావోయిస్టు పార్టీలో చేరాడు. మావోయిస్టు పార్టీలో చేస్తున్న సమయంలో సుష్మిత, దూల మధ్య పరిచయం ఏర్పడి 2020 మార్చి 30న వివాహం చేసుకున్నారు. తరువాత వివిధ హోదాల్లో మావోయిస్టు పార్టీలో పని చేశారు. మావోయిస్టు సిద్ధాంతాలపై నమ్మకం కోల్పోయి తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన పునరావాస పథకం గురించి తెలుసుకుని ఆకర్షితులై లొంగిపోయారని సీపీ అభిషేక్ మోహంతి తెలిపారు. ఒక్కొక్కరిపై నాలుగు లక్షల రూపాయల రివార్డు ఉందని చెప్పారు. ఆ మొత్తాన్ని మావోయిస్టు దంపతులకు సీపీ బ్యాంకు డీడీ రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ పి.తిరుమల్, హసన్‌పర్తి సీఐ జె.సురేష్ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

● కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



రక్తదానం చేసిన సామాజిక కార్యకర్త చెన్నూరు మల్లేశ్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

లింగాలఘణపురం, జూన్14: ఆపదలో ఉన్న వారికి సకాలంలో రక్తం దానం చేసి ఆదుకోగలిగితే ప్రాణదానం చేసినట్లేనని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా లింగాలఘణపురం మండలం కళ్లెంలో శ్రీఛత్రపతి శివాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం వల్ల సాటి మనిషికి ప్రాణం పోసినవాళ్లమవుతామన్నారు. మనం ఇచ్చే రక్తం వల్ల మరొకరికి పునర్జన్మ లభిస్తుందన్నారు. రక్తదానం పట్ల ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బ్లడ్‌బ్యాంకుల్లో రక్తనిల్వలను సిద్ధంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం ఎంతో కీలకమన్నారు. ఈ సందర్భంగా తరుచూ రక్తదానం చేస్తున్న దాతలను శాలువాలతో సత్కరించి అభినందించారు. అనంతరం పక్కనే ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించి మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధన తీరును తెలుసుకున్నారు. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదువుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా తాను అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పిన విద్యార్థులను అభినందించారు. అనంతరం గ్రామంలో మిషన్ భగీరథ ఇంటింటి సర్వే ప్రక్రియను పరిశీలించారు. సర్వేలో క్షేత్రస్థాయి పూర్తిసమాచారాన్ని నమోదు చేయాలని సూచించారు. గ్రామంలో అందరికీ తాగునీరు అందుతోందా అని గ్రామస్థులను అడిగారు.

కలెక్టర్ వెంట డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, తహసిల్దార్ వినయలత, ఎంపీడీవో జలంధర్‌రెడ్డి, రక్తదాన శిబిరం నిర్వాహకులు శ్రవణ్‌కుమార్, తాటిపాముల మల్లేష్, రాజోజు మహేశ్, రవి, సాయిరాం, రాజు, హరీష్, సోషల్ వర్కర్ చెన్నూరు మల్లేశ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కరుణాకర్‌రాజు, ఎంపీవో మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శి సీతారాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

గుట్కా, పొగాకు విక్రయిస్తే కఠిన చర్యలు..

జనగామ కల్చరల్: గుట్కాలు, పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా హెచ్చరించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో డీసీపీ సీతారామ్‌తో కలిసి జాతీయ పొగాకు నియంత్రణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత ప్రభుత్వం జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమాన్ని 2007లో తీసుకొచ్చిందన్నారు. పొగాకు ఉత్పత్తుల వాడకం, ధూమపానం, విక్రయాలను అరికట్టడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, డీఆర్‌డీవో మొగులప్ప, ఇండస్ట్రీస్ మేనేజర్ రమేష్, ప్రోగ్రాం అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో సమస్యల పరిష్కారానికి చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అదనపు కలెక్టర్ పర్మార్ పింకేశ్‌కుమార్



కేజీబీవీలో సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

చిలుపూర్, జూన్ 14: కస్తూర్బాలో సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ పర్మార్ పింకేశ్‌కుమార్ అన్నారు. 'సమస్యల వలయంలో కస్తూర్బా పాఠశాల' పేరుతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తా కథనానికి ఆయన స్పందించారు. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో కలిసి శుక్రవారం ఆయన కేజీబీవీని సందర్శించారు. పాఠశాల ప్రాంగణమంతా కలియతిరిగారు. అసంపూర్తి నిర్మాణంలో ఉన్న ప్రహరీ, గదులు, సామూహిక మూత్రశాలలు, మరుగుదొడ్లతో పాటు, సెప్టిక్ ట్యాంకులను పరిశీలించారు. నిర్మాణాలకు అవసరమైన ప్రణాళికలను సత్వరమే రూపొందించాలని పీఆర్ ఏఈ నరేష్‌కుమార్‌ను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ళ క్రితం నిర్మించిన పాఠశాల భవనంలో అదనపు గదులు, టాయిలెట్స్, ప్రహరీ నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని గుర్తించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కేజీబీవీని చేర్చి కనీస సదుపాయాలను కల్పించడంతో పాటు, పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో అనిల్‌కుమార్, జీసీడీవో గౌసియాబేగం, ఎంపీడీవో బర్మావత్ శంకర్, ఎంపీవో శ్రీపాద మధుసూదన్, ఎమ్మార్వై కలువల శ్రీనివాస్, ఎడ్ల యాదగిరి, నల్ల ఎల్లయ్య, కేజీబీవీ ఇన్‌చార్జి ఎస్‌వో సోని, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు కూలిన చెట్లు



వడ్డెగూడెంలో ఓ గుడిసెపై కూలిన చెట్టు

జఫర్‌గఢ్, జూన్ 14 : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గురువారం రాత్రి వీచిన ఈదురు గాలులతో జనం ఇబ్బందులకు గురయ్యారు. జఫర్‌గఢ్, వడ్డెగూడెం, హిమ్మత్‌నగర్ రహదారులపై పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. వడ్డెగూడెంలో ఓ గుడిసెపై చెట్టు కూలడంతో ఇంటి వాసాలు కూలిపోయి, ఇంట్లోని సామగ్రి దెబ్బతింది. జఫర్‌గఢ్ - హిమ్మత్‌నగర్ ప్రధాన రహదారిపై చెట్లు నేలకూలడంతో హిమ్మత్‌నగర్, సూరారం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం హిమ్మత్‌నగర్ గ్రామానికి వెళ్లాల్సిన రెండు బస్సులు మండల కేంద్రంలోనే నిలిచిపోవడంతో ప్రయాణీకులు ఇబ్బందులకు గురయ్యారు. దీంతో జీపీ సిబ్బంది వాటిని తొలగించి మార్గం సుగమం చేశారు. ఓబులాపూర్, తమ్మడపల్లి(జి) గ్రామాల పరిధిలో ఎల్‌టీ లైనుపై చెట్లు కూలడంతో 16 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయని ఏఈ విశ్వసాహితి తెలిపారు.

కాగా, దెబ్బతిన్న పంటను శుక్రవారం తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య పరిశీలించారు. అధికారులు వెంటనే స్పందించి పంట నష్టంపై అంచనా వేసి బాధిత రైతులకు పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించి సరఫరా పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి నక్క యాకయ్య, ప్రతినిధులు వేల్పుల రాములు, రాపర్తి రజిత, గంగరాజు, నాగరాజు, సోమన్న, చిన్న రాములు, కాట శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ సీపీగా అభిషేక్ మోహంతి

శిక్షణ కోసం వెళ్లిన అంబర్ కిషోర్ ఝా



అభిషేక్ మొహంతి

వరంగల్ క్రైం, జూన్14: వరంగల్ పోలీసు కమిషనరేట్ ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్‌గా కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతిని రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నియమించింది. వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా పదిరోజుల పాటు ఢిల్లీలో జరిగే శిక్షణ కోసం వెళ్లారు. ఈనెల 24న తిరిగి వచ్చే అవకాశం ఉంది. కాగా, కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి పదిరోజుల పాటు వరంగల్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. కాగా, అంబర్ కిషోర్ ఝా బదిలీ అవుతారనే ప్రచారం ఉంది. శిక్షణా కాలం పూర్తయ్యే పది రోజుల్లో బదిలీ గురించి తేలుతుంది.

కుడా వైస్ చైర్‌పర్సన్‌గా అశ్విని తానాజీ వాకడే



వరంగల్ కార్పొరేషన్, జూన్ 14: కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) వైస్ చైర్ పర్సన్‌గా అశ్విని తానాజీ వాకడేను నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్‌గా పని చేస్తున్న అశ్విని తానాజీ వాకడే పూర్తిస్థాయి కమిషనర్ విధులతోపాటు కుడాకు వైస్ చైర్‌పర్సన్ హోదాలో పని చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దాన కిశోర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం కుడా వైస్ చైర్మన్‌గా జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా పని చేస్తున్నారు. ఎన్నిక కోడ్ రావడంవల్ల పూర్తిస్థాయి వైస్ చైర్మన్‌ను నియమించకపోవడంతో జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా కొనసాగుతూ వచ్చారు. కోడ్ ఎత్తేయడంతో రాష్ట్ర ప్రభుత్వం బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు కుడా వైస్ చైర్‌పర్సన్‌గా పగ్గాలను అప్పగించారు.

రేషన్ బియ్యం కొంటే చర్యలు

సివిల్ సప్లయీస్ డీటీ రోజారాణి

తరిగొప్పుల, జూన్ 14: ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని అమ్మినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తప్పవని జనగామ సివిల్ సప్లయీస్ డిప్యూటీ తహసీల్దార్ రోజారాణి హెచ్చరించారు. శుక్రవారం ఆమె తరిగొప్పుల, బొంతగట్టునాగారం గ్రామాల్లో రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి వాటి ప్రకారం స్టాక్ ఉందా లేదా అని చెక్ చేశారు. నర్మెటలో పలు స్క్రాప్ దుకాణాలలో రేషన్ బియ్యం నిల్వ చేస్తున్నారనే సమాచారంతో వాటిని తనిఖీ చేశారు. రేషన్ బియ్యం కొనుగోలు చేస్తే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని యజమానులను హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 14: డివిజన్ కేంద్రంలోని 132/33కేవి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని డీఈఈ హుస్సేన్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేసిన వైర్లు ప్రస్తుతం పెరిగిన లోడ్ తీవ్రతకు తట్టుకోలేకపోతున్నాని, వాటి స్థానంలో కొత్త వైర్లను అమర్చుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా శనివారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు తాటికొండ, ఫత్తేపూర్, శివునిపల్లి, ఇప్పగూడెం, చిలుపూర్, మల్కాపూర్, రాజవరం, చిన్నపెండ్యాల, నెమలిగొండ, తిమ్మంపేట, ఉప్పుగల్లు సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని డీఈఈ తెలిపారు.

పాల బిల్లులను తక్షణమే చెల్లించాలి

విజయ డెయిరీ పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ సాదం రమేష్



హైదరాబాద్ ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న సాదం రమేష్

చిలుపూర్, జూన్ 14 : పాడిరైతులకు చెల్లించాల్సిన పాల బిల్లులతో పాటు, రూ 4ల ఇన్సెంటివ్‌ను సైతం తక్షణమే చెల్లించాలని విజయ డెయిరీ పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ సాదం రమేష్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పాడి రైతుల పక్షాన హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ యాజమాన్యం సకాలంలో బిల్లులు చెల్లించకపోగా, రూ 4ల ఇన్సెంటివ్‌ను సైతం ఎగవేస్తోందని ఆరోపించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పాడి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కో కన్వీనర్ ఇమ్మడి శ్రీనివాస్, ఉల్లిబోయిన సునిల్, తెల్లగొర్ల శ్రీనివాసరావు, చొక్కం రాములు తదితరులు పాల్గొన్నారు.

'దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలి'

జనగామ కల్చరల్, జూన్ 14: భూవివాదం విషయంలో తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత కుటుంబం జనగామ చౌరస్తా లోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన చేపట్టింది. ఈ సందర్భంగా బాధితులు ఈర్ల అనిల్‌కుమార్, ఈర్ల సునీత మాట్లాడుతూ వెంకిర్యాల గ్రామంలో మే 28న తమపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన నిందితులపై అప్పుడే ఫిర్యాదు చేశామని, అయినా విచారణ పేరుతో సీఐ, ఎస్ఐలు కాలయాపన చేస్తున్నారని, ఈ విషయంలో విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

తరిగొప్పుల, జూన్ 14: ఎంపీపీ జొన్నగోని అరిత గౌడ్ అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం స్థానిక రైతువేదికలో ఎంపీడీవో ఆలేటి దేవేందర్ రెడ్డి నిర్వహించారు. పలు శాఖాధిపతులు హాజరై ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ వానాకాలం సీజన్ కావడంతో రైతులకు విత్తనాలు, ఎరువుల బస్తాలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాలకవర్గానికి ఇదే చివరి సర్వసభ్య సమావేశం కావడంతో ఎంపీటీసీలను, మాజీ సర్పంచ్‌లను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెన్నూరి ప్రమీల, జడ్పీటీసీ ముద్దసాని పద్మజ, ఎంపీటీసీలు అర్జుల మధుసూదన్ రెడ్డి, జుంలాల్ నాయక్, తుపాకుల మంగ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

పాలకుర్తి, జూన్ 14 : మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాజీవ్ చౌరస్తాలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు చిట్యాల వేణు, ప్రధానకార్యదర్శి బిర్రు సోమేశ్వర్ మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీ వైద్యులపై ప్రభుత్వం దాడులను నిలిపివేస్తామని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో పోగు శ్రీనివాస్, రాపోలు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, రాంబాబు, సోమన్న, రామూర్తి, పాషా, నరేష్, సోమనారాయణ, శ్రీకాంత్ ఉన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్‌ఎంపీలు

అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు

మీ సేవా కేంద్రాల నిర్వాహకులకు అదనపు కలెక్టర్ వార్నింగ్

జనగామ కల్చరల్, జూన్ 14: మీ-సేవా కేంద్రాల్లో అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా మీ-సేవా కేంద్రాల యజమానులు, ఆపరేటర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రానికి వచ్చిన సభ్యులతో మర్యాదపూర్వకంగా నడచుకోవాలని ఆదేశించారు. కేటాయించిన చిరునామాలలో మాత్రమే కేంద్రాలను నడపాలన్నారు. రిజిస్ట్రేషన్, సర్టిఫికేట్ల జారీ తదితర వసూళ్లలో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఈ-జిల్లా మేనేజర్ దుర్గారావు, తెలంగాణ స్టేట్ టెక్నికల్ సర్వీసెస్ జిల్లా మేనేజర్ రాజు, తెలంగాణ స్టేట్ ఆన్‌లైన్ సర్వీసెస్ మేనేజర్ రాకేష్, మీ-సేవా కేంద్రాల యజమానులు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు నెంబర్లు ఇవ్వాలి



మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న లబ్ధిదారులు

జనగామ కల్చరల్, జూన్ 14: జనగామ పట్టణంలోని మూడవ విడత ఇందిరమ్మ ఇండ్లకు వెంటనే ఇంటి నంబర్లు అలాట్ చేయాలని సీపీఎం జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ 3వ విడత ఇందిరమ్మ లబ్ధిదారులకు మ్యుటేషన్ చేసి ఇంటి నంబర్లు కేటాయించాలన్నారు. అందులో విద్యుత్, సీసీ రోడ్లు, డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, సుంచు విజేందర్, కళ్యాణం లింగం, పల్లెర్ల లలిత, ఎర్ర రజిత, జయ, కొమ్మగళ్ల మణి, బండ రమాదేవి, ఏనుగుల కమల, సౌందర్య, కొన్నె శాంత, రమ, సుధాకర్, అండాలు, బాలస్వామి, ఎండి.షైబెల్లి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రూ.2.50 లక్షల ఎల్‌వోసీ అందజేత



బాధితుడికి ఎల్‌వోసీ పత్రం అందిస్తున్న నాగపూరి కిరణ్‌కుమార్‌గౌడ్

నర్మెట, జూన్ 14 : మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన ఇర్రి కమలాకర్‌రెడ్డి కుమారుడు అజిత్‌రెడ్డి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స కోసం పెద్ద మొత్తం డబ్బులు అవసరం పడ్డాయి. మధ్యతరగతి కుటుంబం కావడంతో కుమారునికి చికిత్స చేయించడం కోసం ఇబ్బందులు పడుతున్నాడు. కాగా స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్‌గౌడ్ ఈ విషయాన్ని దేవాదాయ అటవీశాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె వెంటనే స్పందించి రూ. 2.50 లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించారు. ఎల్‌వోసీ పత్రాన్ని శుక్రవారం నాగపూరి కిరణ్‌కుమార్‌గౌడ్ బాధితుడికి అందించారు. ఎల్‌వోసీ మంజూరు చేయించిన మంత్రి కొండా సురేఖకు, నాగపూరి కిరణ్‌కమార్‌గౌడ్‌కు కమలాకర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

కొనసాగుతున్న మిషన్ భగీరథ సర్వే

బచ్చన్నపేట, జూన్ 14: మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ సర్వే కొనసాగుతోంది. జీపీ కార్యదర్శులు, కారోబార్లు, వీవోఏలు ప్రతీ రోజు ఇంటింటా తిరిగి నల్లా కనెక్షన్ ఉందా, నీళ్లు వస్తున్నాయా.. వచ్చే నీళ్లు సరిపోతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం బచ్చన్నపేట, ఆలింపూర్, తమ్మడపల్లి, నారాయణపూర్, గంగాపూర్, కట్కూర్, కొడవటూర్ గ్రామాల్లో సర్వేను ముమ్మరం చేశారు. నిర్దీత సమయంలో సర్వే పూర్తి చేయాలని ఎంపీడీవో రఘురామకృష్ణ సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు అనిల్‌రాజ్, సౌజన్య, దేవిప్రసాద్, రాజశేఖర్, ప్రశాంత్ ఆచార్య, రూపాచైతన్య, కారోబార్లు, వీవోఏలు పాల్గొన్నారు.

సీఏలపై చర్య తీసుకోవాలి

లింగాలఘణపురం, జూన్14: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన గ్రామైక్య సంఘం సీఏలు దాసరి బాబు, తుంగ రేఖలపై చర్యలు తీసుకోవాలని స్థానికుడు జనగామ యాదగిరి శుక్రవారం ఏపీఎం శంకరయ్యకు ఫిర్యాదు చేశారు. స్త్రీనిధి రుణాలు తీసుకున్న మహిళలు తిరిగి చెల్లించే వాయిదాల డబ్బులను తీసుకోకుండా మహిళలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యుత్ వైరు తెగిపడి మేకలు మృతి

కొడకండ్ల, జూన్ 14: మండలకేంద్రంలో గురువారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన వర్షానికి 11 కేవీ విద్యుత్ వైరు తెగిపడి నక్కా వెంకన్నకు చెందిన 2 మేకలు మృత్యువాత పడ్డాయి. వెంకన్నకు చెందిన 25 మేకలను ఆయన కుమారుడు అనిల్ గురువారం మేతకు తీసుకెళ్ళి తిరిగి వస్తున్న సమయంలో 11 కేవీ వైర్ తెగి మేకలపై పడింది. అనిల్ వెంటనే విద్యుత్ శాఖకు తెలియజేయగా సరఫరాను నిలిపివేయడంతో అప్పటికే 2 మేకలు మృతి చెందాయి. తాము తీవ్రంగా నష్టపోయామని ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.

బాధిత కుటుంబానికి 'అద్దంకి' పరామర్శ

తరిగొప్పుల, జూన్ 14: మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ జన సమితి నాయకుడు బైరి రమేష్ తండ్రి బైరి పోషయ్య (70) అనారోగ్యంతో గత వారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పీఆర్‌వో ఆయోధ్యరెడ్డితో కలిసి శుక్రవారం అక్కరాజుపల్లికి వచ్చి బైరి రమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

మహారాష్ట్ర మాజీ సీఎంను కలిసిన సింగపురం ఇందిర



స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 14: మహారాష్ట్ర మాజీ సీఎం సుశీల్‌కుమార్ షిండేతో పాటు ఆయన కుమార్తె షోలాపూర్ ఎంపీ ప్రణీతి షిండేను టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర శుక్రవారం షోలాపూర్‌లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ప్రణీతి షిండేను శాలువాతో సత్కరించారు.

ఎంపీ కావ్యకు అంగన్‌వాడీల సన్మానం

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 14: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు సీడీపీవో ఫ్లోరెన్స్ ఆధ్వర్యంలో ఇటీవల ఎంపీగా ఘన విజయం సాధించిన కడియం కావ్యను, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిశారు. శుక్రవారం సాయంత్రం హన్మకొండలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సువర్ణ, ధనలక్ష్మి, రజిత, సునిత, అరుణ, ప్రభ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ కావ్యను సన్మానిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు